

‘రేషన్’కు ఈ-కేవైసీ

చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ కోటా దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో▸



అదుపుతప్పిన లారీ

అతి వేగంగా వచ్చిన సిమెంటు లారీ అదుపు తప్పి నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు, కారును ఢీకొట్టింది. 8లో▸



సామాజిక తనిఖీ

ధారూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. 9లో▸

అవినీతి జలగలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బురాన్‌పూర్ గ్రామ సంఘం సభ్యులు

వీఓల డబ్బులు కాజేస్తున్న డీఆర్డీఏ ఉద్యోగులు

- బురాన్‌పూర్ వీఓ ఖాతా నుంచి రూ.10 లక్షలు స్వాహా
- డీపీఎం కుటుంబసభ్యుల అకౌంట్లలోకి డబ్బులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: డీఆర్డీఏలో అవినీతి జలగలు పీక్కు తింటున్నాయి. గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి నియమించిన డీఆర్డీఏ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గ్రామ సంఘాల నుంచి డబ్బులు కాజేసి తమ ఖాతాల్లో జమ చేసుకుంటున్నారు. ఇందులో గ్రామ, మండల స్థాయి ఉద్యోగుల నుంచి డీపీఎంల వరకు అందరి పాత్ర ఉండటం ఆందోళన కలిగిస్తోంది. డీఆర్డీఏ ఉన్నతాధికారి పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి లోన్లు ఇప్పించే క్రమంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆ సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. ఒక్కో సంఘం నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. తాజాగా బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వీఓ ఖాతా నుంచి రూ.10 లక్షలు వారికి తెలియకుండా డీఆర్డీఏ అధికారులు తమ ఖాతాల్లో జమ చేసుకున్న ఘటన బయటకు రావడంతో వారి అవినీతి బాగోతం బహిర్గతమైంది. తాజాగా ఓవో సభ్యులు ఫిర్యాదు చేయటంతో కలెక్టర్ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు.

గుట్టుగా స్వాహా

బురాన్‌పూర్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి మార్కెటింగ్ శాఖ అధికారులు ఏడాది క్రితం గ్రామ సంఘం ఖాతాలో డబ్బులు జమ చేశారు. అందులోంచి డీఆర్డీఏలో విధులు నిర్వహించే ఓ డీపీఎం తన భార్య ఖాతాలోకి రెండు సార్లు డబ్బు జమ చేశారు. ఓ సారి రూ. 2.13 లక్షలు, మరో సారి రూ.2 లక్షలు మొత్తం రూ.4 లక్షల పైచిలుకు డబ్బులు జమ చేశారు. మరో రూ.6 లక్షలు ఇంకొకరి ఖాతాలో జమ చేశారు. ఆ డబ్బులు ఆ ఖాతాలోంచి తిరిగి వీబీకే ఖాతాలో జమ చేసుకుని వాడుకున్నారు. ఇలా మొత్తం రూ. 0 లక్షలు వీఓ ఖాతా నుంచి ఉద్యోగులు కాజేశారు. ఈ విషయం తెలుసుకున్న వీఓ సభ్యులు బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాల్లో ఎంత డబ్బులు ఉన్నాయో చెప్పాలని కోరారు. దీంతో బ్యాంకు ఖాతా నుంచి తమకు తెలియకుండా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించారు. వీఓ సభ్యులకు చదువు రాకపోవడం, ఉద్యోగులను గుడ్డిగా నమ్మడం వంటి వాటి కారణంగా డబ్బు కాజేసినట్లు తెలిసింది.

అధికారుల పాత్ర కూడా..

ఈ మొత్తం తతంగంలో ఓ వీబీకే,ఓ డీపీఎ పాత్ర ప్రత్యక్షంగా ఉండగా ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఆర్డీఏ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరును బట్టి వారి పాత్ర కూడా ఉన్నట్లు స్పష్టమవుతోంది. తమకు తెలియకుండా తమ సంఘం ఖాతాలోంచి డబ్బులు డ్రా చేశారని తెలుసుకున్న వీఓ సభ్యులు నాలుగు నెలల క్రితమే డీఆర్డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు విచారణ జరపలేదు. బాధ్యుల మీద చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల వరకు వాటాలు ఇవ్వడంతోనే వారు ఈ విషయాన్ని చూసి చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామ సంఘం సభ్యులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బుధవారం ఈ విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను విచారణకు ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పరీక్షలకు సన్నద్ధం చేయండి

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 10వ తరగతి పరీక్షలపై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా బోధన చేసి విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని సూచించారు. గత ఏడాది ఉత్తీర్ణత శాతం తక్కువ రావడానికి గల కారణాలను అన్వేషిస్తూ అలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. ఉపాధ్యాయులు తలచుకుంటే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేసుకోవాలని డీఈవోకు సూచించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పరీక్షల సమయంలో మండల అధికారులను విధుల్లో భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, డీసీఈబీ చైర్మన్ అనంతరెడ్డి, ఏసీ జీ రామ్‌రెడ్డి మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్హాను సందర్శించిన మంత్రి జూపల్లి



నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతివనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా కన్హా శాంతివనంలో జరుగుతున్న ఓ సదస్సుకు హాజరైన ప్రముఖులను కలిసినట్లు తెలిసింది. కన్హాను సందర్శించిన వారిలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, కొమ్ము కృష్ణ, కొత్తూరు, నందిగామ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహా యాదవ్, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న నేవీ అధికారి,(చిత్రంలో)ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నేవీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్!

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిసిన అధికారుల బృందం

పరిగి: పూడూరు మండలం దామగుండం ప్రాంతంలో నేవీ ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం నేవీ కమాండో అధికారి కార్తీక్ శంకర్ బృందం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యే చాలా కాలంగా కృషి చేస్తున్నారని, గత ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తెచ్చినట్లు సీఎం చెప్పినట్లు వారు తెలిపారు. వచ్చే నెలలో ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. దామగుండం ఆలయ ప్రాంతానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శత్రు దేశాల నుంచి మనకు ముప్పు ఉన్నందున పీఎం పర్యవేక్షణలో పని చేసే నేవీ జలాంతర్గాములు పరిగి ప్రాంతంలో తయారు చేయడం ఎంతో మంచి నిర్ణయమన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అంతర్జాతీయ పాఠశాలల్లో మన ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక కోటా ఉంటుందని, అంతేకాకుండా పూడూరు మండలం టౌన్ షిప్‌లా మారుతుందన్నారు. కార్యక్రమంలో నేవీ కల్నల్ హిమంత్‌రెడ్డి, అధికారులు సందీప్ దాస్, రాజ్‌బీర్‌సింగ్, మణిశర్మ, మనోజ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కెమికల్స్‌తో అల్లంవెల్లుల్లి పేస్ట్

- తయారీదారుల అరెస్ట్
- 11.14 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి



నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీకి ఉపయోగించే కెమికల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: వెల్లుల్లి పొట్టు, ప్రమాదకర కెమికల్స్‌తో తయారు చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ పీఎస్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కోటిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఉదయం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌చార్జ్ ప్రశాంత్ వర్ధన్, వికారాబాద్ సీఐ శీను పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉప్పరిపల్లికి చెందిన మన్సుక్ తన ట్రాలీ ఆటోలో హైఫై, టేస్టీ కింగ్ టైగర్ పేరుగల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. అతన్ని విచారించగా నగరంలోని అత్తాపూర్ హ్యాపీ హోం టవర్‌లో ఉండే అజిత్ చరణ్యా వద్ద కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు చెప్పాడు. దీంతో అజిత్ చరణ్యాను పీఎస్‌కు పిలిపించారు. కేవలం వెల్లుల్లి పొట్టు, యాసిడ్, ఇతర కెమికల్స్‌తో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అనంతరం చరణ్యా ఇంట్లో తనిఖీలు చేశారు. 30 కాటన్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ డబ్బాలు, 30 కేజీల అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిగిన నాలుగు డ్రమ్ములు, కెమికల్స్, యాసిడ్స్, సుమారు 11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నకిలీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా తక్కువ ధర వచ్చే వాటిని కొనుగోలు చేయరాదని సూచించారు. నకిలీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు లేదా డయల్ 100, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ సెల్ 8712583483కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వికారాబాద్ టౌన్ సీఐ శీను, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పంట ప్రాసెసింగ్‌తో లాభాలు

నూతన వంగడాలను పరిశీలించిన మహారాష్ట్ర రైతులు

తాండూరు: పంట దిగుబడిని రైతులు నేరుగా మార్కెట్‌కు తరలించకుండా ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తే అధిక లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానాన్ని మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లా రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రతినిధులు సందర్శించారు. ఆత్మ ప్రాజెక్టులో భాగంగా సాగవుతున్న కంది, కుసుమ, జొన్న తదితర పంటలను పరిశీలించారు. పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. అధిక సాంద్రత కలిగిన భూముల్లో మెలకువలు పాటిస్తే పత్తి పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. వివిధ పంటల్లో చీడ పీడల నివారణపై శాస్త్రవేత్త టీ రాజేశ్వర్‌రెడ్డి రైతులకు అవగహన కల్పించారు. అనంతరం కుసుమ నూనె యంత్రం, కందిపప్పు మిల్లుల నిర్వహణపై రైతులకు అవగహన కల్పించారు. ఏరువాక కేంద్రం కో- ఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న మహారాష్ట్ర రైతులు



అధికారులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

పనుల వేగం పెంచండి

- ఫిబ్రవరి చివరి నాటికి జెడ్పీ భవన నిర్మాణం పూర్తి కావాలి
- చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: జెడ్పీ నూతన భవన నిర్మాణం ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి కావాలని, ఆ దిశగా పనుల వేగం పెంచాలని చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న జెడ్పీ భవన నిర్మాణ పనులపై పీఆర్ ఇంజనీర్లతో సమీక్షించారు. ఫిబ్రవరి చివరి నాటికి భవనం అందుబాటులోకి తేవాలని సూచించారు. అలాగే జిల్లాకు మంజూరైన అంగన్‌వాడీ, డ్వాక్రా భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జెడ్పీ అతిథి గృహాల నిర్మాణ పనులు, పాత ఎంపీడీఓ కార్యాలయాల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ శుభాషిణి, పీఆర్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్ బాబు, డీఈఈలు పాల్గొన్నారు.

విభిన్న ఆలోచనలతోనే..



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డీఈఓ సుశీందర్‌రావు, అధికారులు

నూతన ఆవిష్కరణలు

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సృజనాత్మకత, మేధా శక్తికి ప్రతిరూపమే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇబ్రహీం పట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో జరుగుతున్న జిల్లాస్థాయి సైన్స్, గణిత, పర్యావరణ వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సుశీందర్‌రావు మాట్లాడుతూ.. భిన్నమైన ఆలోచనలు ఉంటేనే కొత్త ఆవిష్కరణలు పుడతాయన్నారు. ఏదైనా లక్ష్యాన్ని సాధించాలంటే నిరంతరంగా శ్రమించాలన్నారు. అనంతరం జ్యారీ ప్లానటరీ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ నేథనియల్ మాట్లాడుతూ.. నేడు మనం అనుభవిస్తున్న విజ్ఞాన ఫలాలు ఎంతోమంది శాస్త్రవేత్తల కృషి ఫలితమేనన్నారు. అలాంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని కొత్త ఆవిష్కరణలకు బాటలు వేయాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలోని 79 పాఠశాలల విద్యార్థులు 280 ప్రాజెక్ట్‌లు, ఉపాధ్యాయులు మూడు ప్రాజెక్ట్‌లు, 38 సెమినార్‌లు ఈ సందర్భంగా ప్రదర్శించబడినట్లు తెలిపారు. 56 పాఠశాలలకు చెందిన 7,500 మంది విద్యార్థులు, పేరెంట్స్ ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించినట్లు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆయా పాఠశాలల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రాజిరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ రాంచంద్రారెడ్డి, విద్యాధికారులు వెంకట్‌రెడ్డి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఏఎంసీ చైర్మన్ పదవికి ప్రశాంత్‌గౌడ్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న ప్రశాంత్‌గౌడ్

నవాబుపేట: కాంగ్రెస్ అంటే రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే వారి నెల రోజుల పాలనలో రైతుబంధు లేదు.. గిట్టు బాటు ధరలు లేవని నవాబుపేట ఏఎంసీ చైర్మన్ జీ ప్రశాంత్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన మార్కెట్ కార్యాలయంలో తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మారడంతో తమ నిర్ణయాలు కొనసాగవని రాజీనామా చేసినట్లు తెలిపారు. నెల రోజులు కాంగ్రెస్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం సరికాదని హితవు పలికారు. ఎమ్మెల్యే యాదయ్య ప్రోత్సాహంతో నవాబుపేట నూతన మార్కెట్ కమిటీ ఏర్పడిందన్నారు. మేకల సంతను ప్రారంభించామని తెలిపారు. నూతన కార్యాలయానికి స్థల సేకరణ చేశామన్నారు. రైతులకు ఏదో చేయాలనే తపనతో చైర్మన్ కావడం జరిగిందన్నారు. అధికారంలో మారడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మ ధర తగ్గట్లే..!



వికారాబాద్ అర్బన్: సాధారణంగా వేసవిలో నిమ్మకాయల ధరలు అధికంగా ఉంటుంది. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉన్నా వాటి ధర తగ్గడం లేదు. ఎండాకాలంలో నిమ్మ రసం అధికంగా తీసుకోవడం తోపాటు, శుభకార్యాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీంతో ఒక్కో నిమ్మకాయ ధర రూ. 5 వరకు పలకడం సహజం. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉంది. అయినా వాటి ధరలు తగ్గడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక నిమ్మకాయ రూ. 5 పలుకుతోంది. ఇప్పుడే ధర ఇలా ఉంటే వేసవిలో మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వినియోగదారులు అంటున్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

వికారాబాద్ అర్బన్: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు, ఇతర ట్రస్టుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించడం జరుగుతుందని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఆయా కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఫిబ్రవరి 15వ తేదీలోగా సంబంధిత జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. 10వ తరగతి, ఐటీఐ వారికి రూ. 1,000, పాలిటెక్నిక్ వారికి రూ. 1,500, ఇంజనీరింగ్, మెడిసిన్, లా,బీఎస్సీ (అగ్రికల్చర్,వెటర్నరీ,నర్సింగ్, హార్టికల్చర్, వీఎస్‌సీసీ) కోర్సులకు రూ. 2000, బీసీఏ, ఎంసీఏ, బి.ఫార్మసీ, ఎం ఫార్మసీ,బీబీఏ,ఎంబీఏ, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, పీజీ వారికి రూ. 2000లు ఏడాదికి ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల కోర్సుల్లో మార్కుల శాతాన్ని బట్టి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా సహాయక కార్మిక శాఖ కార్యాలయం పొందవచ్చునని తెలిపారు.

యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా..



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఆంజనేయులు

కొడంగల్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన ఆంజనేయులును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి పట్టణంలో బుధవారం యాదవ సంఘం సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య యాదవ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని గొల్ల కురుమలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలని అన్నారు. గొల్ల కురుములు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

క్లుప్తంగా

27న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు

కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ నెల 27న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై ఎమ్మార్పీఎస్ నాయకులు చర్చించారు.

గాయపడిన వ్యక్తి మృతి

తాండూరు టౌన్: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందారు. మంగళవారం రాత్రి తాండూరు పట్టణంలో లారీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో శేఖర్(45)కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంటల పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న గోపాల్, తదితరులు

ధారూరు: వ్యవసాయ విస్తరణ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల వివరాలు తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్ బుధవారం ధారూరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ రైతుల పొలాలను పరిశీలించారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, జొన్న తదితర పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. వేరుశెనగ పంటలను పరిశీలించి చీడ పురుగుల నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సంజూరాథోడ్, ఉలెండస్, త్రైలోక్య, రైతు నాయకుడు వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

13న మోడల్ టెస్ట్

కొడంగల్ రూరల్: నవోదయ పాఠశాల, సైనిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఈ నెల 13న మోడల్ టెస్ట్ (నమూనా పరీక్ష)నిర్వహించనున్నట్లు పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం క్రాంతికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మోడల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. 5వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 13వ తేదీలోపు సెల్ నంబర్లు 83097 55644, 99123 86643ను సంప్రదించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

కొడంగల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడగించినట్లు బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల వికారాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి యాదయ్యగౌడ్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని అన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాడితో లాభాలు ఆర్జించాలి

ఇబ్రహీంపట్నం: పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని రైతులకు జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి అంజలప్ప సూచించారు. మున్సిపల్ పరిధిలోని సీతారాంపేటలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్సలు చేయించాలన్నారు.

'రేషన్'కు ఈ-కేవైసీ

- రేషన్ బియ్యానికి వేలిముద్ర తప్పనిసరి
- బోగస్‌కు చెక్ పెట్టేందుకే
- పారదర్శకతే లక్ష్యంగా కొనసాగుతున్న ప్రక్రియ
- మండలంలో 44,406 లబ్ధిదారులు

దోమ: నిరుపేదల ఆకలి తీర్చేందుకు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ కోటా దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ కార్డులో పేరున్న కుటుంబంలోని ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని రేషన్ షాపులకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించింది. రేషన్ దుకాణాల్లో మాత్రమే వేలిముద్రలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషన్ నుంచి జిల్లా ఆదేశాలు కూడా వచ్చాయి. దీంతో వేలిముద్రలు వేయించేందుకు గ్రామ స్థాయిలో రేషన్ డీలర్లుకు అవగాహన కల్పిస్తున్నారు. నిర్లక్ష్యం వహిస్తే సరుకులు కట్ అయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

44,406 మంది లబ్ధిదారులు

మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలకు గాను 34 రేషన్ దుకాణాలు ఉండగా.. అందులో 13,112 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 44,406 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో 1,909 అంత్యోదయ కార్డులకు 4,843 మంది లబ్ధిదారులు ఉండగా, 1,1203 ఆహార భద్రత కార్డులకు 39,563 మంది లబ్ధిదారులున్నారు. ఇప్పటి వరకు మండలం 70 శాతం ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలుస్తోంది. 30 శాతం లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని డీలర్లు అంటున్నారు. వారందరికీ ఈకేవైసీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

ఈ-కేవైసీ నమోదు ఇలా..

రేషన్ కార్డు కలిగిన కుటుంబ యాజమానితో పాటు కార్డులో పేర్లు ఉన్న సభ్యులందరూ సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి డీలర్ వద్ద ఈ-పాస్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయడంతో రేషన్ కార్డు నంబర్‌తో పాటు సభ్యుల ఆధార్ నంబర్లు చూపిస్తుంది. వీరిని సరిచూసిన తర్వాత ఆకుపచ్చ లైట్ వెలిగి సభ్యుని ఈకేవైసీ పునరుద్ధరణ అవుతుంది. ఒకవేళ ఈ-పాస్ యంత్రంలో ఎరుపు రంగు లైట్లు వెలిగితే వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిపోలేదంటూ రిజెక్టు చేస్తుంది. దీని ద్వారా రేషన్ కార్డులో నిజమైన లబ్ధిదారులు మిగిలిపోతారు.



రేషన్ దుకాణంలో ఈకేవైసీ చేస్తున్న డీలర్

ఈ కేవైసీ తప్పనిసరి



రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఉపాధి, ఇతర పనుల కోసం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు తమ సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి రేషన్ నంబర్‌తో నమోదు చేసుకోవచ్చు. రేషన్ బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులుంటే వారందరూ ఈ కేవైసీ నమోదు చేసుకోవాలి.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

నమోదు చేస్తున్నాం



రేషన్ కార్డుకు ఈకేవైసీ చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈకేవైసీని నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు రేషన్ దుకాణాల రావాలని చెబుతున్నాం. ఈకేవైసీ చేయించుకోని వారికి సరుకులు నిలిపోయే అవకాశం ఉంటుందని అవగాహణ కల్పిస్తున్నాం.

– నరేందర్, డీలర్, బొంపల్లి

అదుపుతప్పిన సిమెంటు లారీ

- దెబ్బతిన్న రెండు ద్విచక్ర వాహనాలు
- కారులోని వ్యక్తికి తీవ్ర గాయాలు

తాండూరు టౌన్: అతి వేగంగా వచ్చిన సిమెంటు లారీ అదుపుతప్పి నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు, కారును ఢీకొట్టింది. ఈ ఘటన బుధవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న లారీ పట్టణంలోని ఫ్లై ఓవర్ దాటగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, కారును ఢీకొట్టింది. దీంతో బైకులు నుజ్జునుజ్జు కాగా, కారులో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.



లారీ చక్రాల కింద ద్విచక్రవాహనాలు

గ్రీన్ ట్రిబ్యునల్‌లో దావా

తాండూరు: తాండూరు ప్రాంతంలో కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైన ప్రభుత్వ శాఖల అధికారులపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో దావా వేసినట్లు స్థానిక వ్యాపారి, సామాజిక కార్యకర్త రాజ్‌గోపాల్ సార్డా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తాండూరులో మురుగు కాలువలను క్రమబద్ధీకరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. చిలుక వాగు మురుగు నీటితో నిండిపోయిందన్నారు. ఈ వాగును పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. గతంలో జాతీయ హరిత ట్రిబ్యునల్, కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అయినా స్పందించడం లేదన్నారు. కాగ్నా నదిలోకి మురుగు నీరు చేరుతోందని, దీంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందన్నారు. తాండూరులో కాలుష్య నియంత్రణకు రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వంలోని ఆరు శాఖలకు చెందిన అధికారులపై ఈ నెల 7న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చెన్నై)లో దావా వేసినట్లు తెలిపారు. దావాను ట్రిబ్యునల్ స్వీకరించిందన్నారు. ఈ ప్రాంతంలో కాలుష్యం తగ్గే వరకు తన పోరాటం ఆగదని పేర్కొన్నారు.



రాజ్‌గోపాల్‌సార్డా

సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి తరలించండి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

యాలాల: ఈ నెలాఖరులోగా సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)ను రైసుమిల్లర్లు ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని బాలాజీ, వెంకట పద్మావతి రైసుమిల్లులను ఆయన తనిఖీ చేశారు. రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా రైసు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని డెలవరీ చేయాలన్నారు. మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించి సకాలంలో ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మిల్లుల్లో స్టాక్ వివరాలు, గన్నీ బ్యాగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్త ఉన్నారు.



బియ్యం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆడపిల్లల బాధ్యత అందరిదీ



బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న బలరాం

వికారాబాద్ అర్బన్: ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహిళా సాధికార జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. బలరాం అన్నారు. బుధవారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలను విద్యా పరంగా ప్రోత్సహించాలని కోరారు. ఆడపిల్లలకు ఎలాంటి ఆపదవచ్చినా హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 14,567, దివ్యాంగుల హెల్ప్‌లైన్ నంబర్ 1,55,326 నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సబిహ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామంగా ఆన్‌లైన్ నమోదు



కంపూటరీకరణను పర్యవేస్తున్న అధికారులు

ధారూరు: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా వచ్చిన 15,108 దరఖాస్తుల్లో బుధవారం వరకు 9 వేలకు పైగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియను రాత్రి కూడా కొనసాగిస్తున్నారు. మండల ప్రత్యేక అధికారి మల్లేశం పర్యవేక్షణలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంపీఓ షఫీవుల్లా ఆన్‌లైన్ నమోదును పర్యవేక్షిస్తున్నారు. దరఖాస్తుల్లో కొందరు వివరాలను సరిగ్గా నమోదు చేయకపోవడం, వారికి ఫోన్లు చేసి వివరాలను నమోదు చేస్తున్నారు. గురువారం వరకు ఆన్‌లైన్ నమోదును పూర్తి చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి మల్లేశం తెలిపారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

పరిగి: గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టిన పెంపకం దార్లకు వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ కోసం డీడీలను కట్టించుకున్నారని, ఆరు నెలలైనా ఇంతవరకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయలేదన్నారు. గొర్రెలపైనే ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాముయాదవ్, నరేంద్రయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మండల అధ్యక్షుడు విశ్వనాథ్, కృష్ణ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఆర్ఎంపీ క్లినిక్‌లో డ్రగ్స్ పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ఆర్ఎంపీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. డ్రగ్స్ కంట్రోల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నుంచి వచ్చిన సమాచారం మేరకు తెలంగాణ అధికారులకు సమాచారం రావడంతో బుధవారం ఆదిభట్లలోని ఎంపీపటేల్‌గూడలో కె.హనుమంతరావు క్లినిక్‌పై దాడిచేశారు. కాగా దాడుల్లో యాభైవేల విలువైన యాంటీ బయాటిక్స్, అనాల్జెసిక్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీ హైపెర్టెన్సివ్స్ తదితర 87 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మొత్తం లక్ష రూపాయల విలువైన స్టాక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మందులు ప్రజల ఆరోగ్యాలపై చెడు ప్రభావం చూపుతాయని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ దాడిలో అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ అబిదా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలాపూర్ నాగరాజు, సరూర్‌నగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌రాజు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లలో చోరీలు
- ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దంటున్న పోలీసులు

షాద్‌నగర్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో వరుస సెలవుల రావడంతో చాలామంది బంధువుల ఇళ్లకు, స్వగ్రామాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. ఇలాగే ఊళ్లకు వెళ్లేవారి ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తుంటారు. దొరికినకాడికి దోచుకొని పరారవుతుంటారు. ఇలాంటివి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

- సెలవులకు ఊరు వెళ్తుంటే కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి. అలాగే నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే ఇంటికి సెక్యూరిటీ గార్డుగా పెట్టుకోవాలి.
- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు ఉంచకూడదు.
- వాటన్నింటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100 డయల్ చేయాలి
- ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్తుంటే పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి తప్పనిసరిగా తాళం వేయాలి. ద్విచక్రవాహనాల చక్రాలకు చైన్స్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.
- ఇంట్లో సీసీ కెమరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి.
- ఇంట్లో లేనప్పుడు ఇంటిముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు, జమ కానివ్వకుండా చూసుకోవాలి. వీటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి.
- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- ఇంటి డోరు తాళం వేసి కర్టన్‌ను వేయడం మర్చిపోవద్దు
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.



కేశంపేటలో ఇటీవల చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

లారీ డ్రైవర్లకు తీరని అన్యాయం

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

అబ్దుల్లాపూర్‌మెట్: భారత న్యాయ సహితే చట్టంలోని సెక్షన్ 106 మరియు 1.2 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం కూడలిలో విజయవాడ జాతీయ రహదారిపై ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అజయ్ బాబు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాతర రుద్రకుమార్‌తో కలిసి నిరసన తెలిపారు ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త చట్టం తీసురావాలన్నా...ఉన్న చట్టంలో సవరణ చేయాలన్న ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రతీ డ్రైవర్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్ లేదా లారీ మోటర్ డ్రైవర్‌కు మాత్రమే కాకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి వ్యక్తికి ఈ చట్టం వర్తిస్తుందని.. ఈచట్టం వల్ల డ్రైవర్లకు ఇబ్బందులు తప్పవన్నారు. పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ ఈ చట్టాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నర్సింహ, ప్రభాకర్, రాములు, వీరయ్య, శ్రీశైలం, శంకర్, జహంగీర్, అబ్దుల్, రహీం, షరీఫ్, రఫీక్, డ్రైవర్లు పాల్గొన్నారు.

మాటలతో బురిడీ కొట్టించి..

- మహిళ పుస్తెలతాడుతో నిందుతుడి పరార్

కొందుర్గు: మాయమాటలతో మహిళ మెడలో నుంచి ఓ దుండగుడు బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటన కొందుర్గు మండలం ఆగిర్యాలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగిర్యాలకి చెందిన దేవమ్మ(55) గ్రామ శివారులోని సపోట తోటలో పనిచేస్తుండగా గుర్తుతెలియని ఓవ్యక్తి తోట వద్దకు వచ్చి కుర్వ మల్లయ్య దగ్గర మేకలు విక్రయించేందుకు వచ్చానని అతనితోట ఎక్కడ ఉందో చెప్పాలని అడిగాడు. ఆమె అతని ఫాం ఇక్కడ లేదని చెప్పింది. సపోటా పండ్లు అమ్మేవి ఉన్నాయా అంటూ సదరు వ్యక్తి మాటల్లో దింపాడు. లేవని ఆమె చెప్పడంతో.. తాగడానికి నీళ్లు కావాలని అడిగాడు. నీళ్లు మోటార్ బోరు వద్ద ఉన్నాయేమో చూడమని చెప్పింది. ఇదే అదునుగా దేవమ్మ మెడలోని బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కొని బైక్‌పై రెడీగా ఉన్న మరో వ్యక్తితో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఘటనాస్థలిని ఏసీపీ రంగస్వామి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు కొమ్మ



కేసారం స్టేజీ వద్ద రోడ్డుపై విరిగిపడిన మర్రి కొమ్మ

- తప్పిన ప్రమాదం
- ట్రాఫిక్‌కు అంతరాయం

చేవెళ్ల: మండల పరిధిలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రి చెట్టు భారీ కొమ్మ విరిగిపడి వాహనదారులకు ప్రమాదం తప్పింది. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని కేసారం బస్ స్టేజీ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారికి రెండు వైపులా భారీ మర్రి చెట్లు ఉన్నాయి. గతంలో కూడా పలుమార్లు వీటి కొమ్మలు అకస్మాత్తుగా విరిగిపడి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో వాహనదారులు ప్రాణాలు సైతం కోల్పోయారు. తాజాగా ఎలాంటి గాలివాన లేకపోయినా ఓ చెట్టు భారీ కొమ్మ విరిగి రోడ్డుపై పడిపోయింది. ఇది గమనించిన వాహనదారులు కొద్ది దూరంలోనే ఆగిపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో వారు జేసీబీ సాయంతో కొమ్మను పక్కకు వేయించారు. ఘటనతో కొద్దిసేపు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



రాంసింగ్ తండాలో రైతులకు కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న వైస్ చాన్స్‌లర్, పశువైద్యాధికారి

- పీవీ పశు వైద్య కళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోడి పిల్లల పంపిణీ

షాబాద్: రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు పశు వైద్య కళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంసిగ్‌తండా, హన్మనాయక్‌తండాల్లో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వంద మంది రైతులకు ఉచితంగా పెరటి కోడి పిల్లలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తే ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ రైతులు పెరటి కోళ్ల పెంపకాన్ని చేపట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక్కొక్కరికి 20 కోడి పిల్లలు, పది కిలోల దాణా ఉచితంగా అందజేస్తోందని స్పష్టంచేశారు. ఈ యూనిట్ ధర రూ.1,500 ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.